# పాశం

మధ్యాహ్నం. లాగోస్ పట్టణం. కసాంగ వీధిలో నెనే గది.

'మీ నాన్నకు రాశావా?' అడిగింది నెనే, నమేకాను.

'లేదు. దాని గురించే ఆలోచిస్తున్నాను. సెలవులో ఇంటికి వెళ్లినప్పుడు చెప్పటం మంచిదనిపిస్తోంది.'

'ఏం? నీ సెలవు ఇంకా ఆరువారాల తర్వాత కదా! ఈ సంతోష వార్తను ఆయనకు ఇప్పుడే చెప్పాలి.'

కాసేపు ఏం మాట్లాడలేదు నమేకా. తర్వాత పదాలకోసం వెతుక్కుంటున్నట్టుగా నెమ్మదిగా అన్నాడు- 'ఈ వార్త నిజంగా ఆయనకు సంతోషాన్ని కలిగిస్తే బాగుండును.'

'అదేంటి? ఎందుకు కలిగించదు?' ఆశ్చర్యపోయింది నెనే.

'నువ్వు పుట్టినప్పట్నుండి లాగోస్‌లోనే పెరిగావు. మారుమూల ప్రాంతాల్లో జనాల గురించి నీకు తెలీదు.' అన్నాడు నమేకా.

'నీవెప్పుడూ అలాగే అంటావు. కానీ కొడుక్కి ఎంగేజ్‌మెంట్ అయి పెళ్ళి చేసుకోబోతున్నాడంటే ఎవరికి మాత్రం సంతోషంగా వుండదు?'

"అవును. సంతోషంగా ఉండదు. ఎందుకంటే పెళ్లి వాళ్లు కుదిర్చింది కాదు కాబట్టి. మన విషయంలో మరీను- నీవు 'ఈబో' కాదుగా". చాలా సీరియస్‌గా, సూటిగా నమేకా అలా అనేసరికి కాసేపు నోటమాట రాలేదు నెనేకు. నగరాలలోని కాస్మోపాలిటన్ సంస్కృతికి అలవాటుపడిన నెనేకి ఓ వ్యక్తి ఎవర్ని పెళ్ళిచేసుకోవాలనేది 'తెగ' మీద ఆధారపడ్డమనేది ఎప్పుడూ హాస్యాస్పదంగానే అనిపిస్తుంది. చివరకిలా అంది-

'కేవలం ఈ విషయంవల్లనే మన పెళ్ళికి ఒప్పుకోరంటావా మీ నాన్న? మీ 'ఈబో'లు ఇతర తెగలపట్ల సుహృద్భావంతో వుంటారనుకున్నాను'.

'నిజమే. కానీ... 'పెళ్ళి'... అది అంత చిన్న విషయం కాదు. అయినా ఇది మా ఈబో తెగకే ప్రత్యేకం కాదు. మీ నాన్నగారే బతికుండి ఈబో ప్రాంతంలో వుంటే ఆయన కూడా అచ్చం మా నాన్నలాగే ప్రవర్తించి వుండేవారు.'

'ఏమో! ఏది ఏమైనా, మీ నాన్నకు నువ్వంటే చాలా ప్రేమ కాబట్టి, త్వరగానే నిన్ను క్షమిస్తార్లే. మంచి అబ్బాయి లాగా మీ నాన్నకో మంచి లెటర్‌రాయి.'

'ఈ సంగతి ఉత్తరం ద్వారా చెప్పడం అంత మంచిదికాదు. ఆయన షాక్ తింటారు. ఇది మాత్రం నాకు తెలుసు.'

'సరే. నీ ఇష్టం.'

ఆ సాయంత్రం ఇంటికి నడుస్తూ నమేకా తన తండ్రిని ఒప్పించడానికి వరివరివిధాల ఆలోచించాడు. ఆయన కూడా తనకో అమ్మాయిని చూసిపెట్టాడు. అదీ వచ్చిన తంటా. తండ్రి రాసిన ఉత్తరం నెనేకు చూపిద్దామనుకుని కూడా చివరి నిమిషంలో మనను మార్చుకున్నాడు తను. ఇంటికి వెళ్ళాక మరోసారి ఆ ఉత్తరాన్ని చదివాడు నమేకా. తనకు తెలీకుండానే నవ్వొచ్చింది. తనకి యుగోయి చాలా గుర్తు. ఏటికి వెళ్ళే తోవలో అబ్బాయిల్నందరినీ- తనని కూడా- ఉతికేసేది బలిష్టంగా వున్న యుగోయి. చదువు మాత్రం శూన్యం.



"నీకు చక్కగా సరిపోయే అమ్మాయిని చూశాన్నేను. యుగోయి వేకే. మన వక్కింటి జేకబ్ వేకే పెద్ద కూతురు. చక్కటి క్రైస్తవ మతాచారంలో పెరిగింది. కొద్ది సంవత్సరాల క్రితం బడి మానేసినప్పుడు వాళ్ల నాన్న (మంచి ఆలోచనాపరుడు) ఆ అమ్మాయిని ఓ పాస్టర్ ఇంట్లో వుంచాడు. అక్కడ ఆమె ఒక గృహిణికి కావలసిన తర్ఫీదంతా పొందింది. బైబిల్ చక్కగా చదవగలదని చెప్పింది ఆమె 'సన్‌డే స్కూల్' టీచరు. నువ్వు డిసెంబరులో ఇంటికి వచ్చినపుడు సంప్రదింపులు మొదలుపెడదాం."

**ఆంగ్లమూలం: చినువా అచీబీ**
**తెలుగు సేత: డా. కె.పద్మినీ శంకర్**

లాగోస్‌నుంచి వచ్చిన రెండోరోజు వాళ్ల నాన్నతో కాసియా చెట్టుకింద కూర్చున్నాడు నమేకా. డిసెంబరు మండుటెండ తగ్గి సేదదీర్చే చల్లగాలి వీచినప్పుడు ఆ చెట్టు కింద కూర్చుని బైబిల్ చదువుకోవటం చాలా ఇష్టం ఆ పెద్దాయనకి.

'నాన్నా! మీరు నన్ను క్షమించాలి' ఉన్నట్టుండి ఒక్కసారిగా అన్నాడు నమేకా.

'క్షమాపణలా? ఎందుకు?' ఆశ్చర్యపోయాడు ఒకేకే- నమేకా తండ్రి.

'అది... ఈ పెళ్ళి విషయంలో..."

'ఏ పెళ్ళి విషయంలో?'

'నేను... మనం... నేను వేకే కూతుర్ని పెళ్ళి చేసుకోవడం అసాధ్యం'

'అసాధ్యమా? ఏం?'

'నాకా అమ్మాయంటే ఇష్టంలేదు'

'ఇష్టముందని ఎవరన్నారు? ఎందుకుండాలి?' ప్రశ్నించాడు ఒకేకే.

'అది కాదు నాన్నా. ఈ రోజుల్లో పెళ్ళి అనేది చాలా డిఫరెంట్...'

'ఇలాచూడు.' నమేకా మాటను మధ్యలోనే తుంచేస్తూ అన్నాడు వాళ్లనాన్న- 'ఏదీ, ఏమీ మారలేదు. కాబోయే భార్యలో చూడవలసింది మంచి ప్రవర్తన, క్రైస్తవ పెంపకం'

ఇక, ఇలా వాదించి లాభం లేదనుకుని అన్నాడు నమేకా- 'అదీ కాక- యుగోయి లోని మంచి లక్షణాలన్నీ వున్న ఇంకో అమ్మాయికి, నాకు ఎంగేజ్‌మెంట్ అయింది. ఆ అమ్మాయి...'

తన చెవుల్ని తానే నమ్మలేకపోయాడు ఒకేకే. ఒక్క క్షణం తేరుకుని నెమ్మదిగా అన్నాడు- 'ఏమన్నావ్?'

'ఆ అమ్మాయి చాలా మంచి క్రిస్టియన్. లాగోస్‌లోని ఓ ఆడపిల్లల స్కూల్లో టీచర్.' చెప్పాడు నెనే.

'టీచరా? ఓ మంచి భార్య కావడానికి 'అది' అర్హత అని నీవనుకుంటే, ఏ క్రైస్తవ స్త్రీ కూడా బోధన వృత్తిలో వుండరాదన్న విషయాన్ని నేను నీకు గుర్తుచేయాలిప్పుడు. కొరింతియన్లకు పౌలు రాసిన ఉత్తరంలో స్త్రీలు మౌనంగా వుండాలని శాసించాడు.'

నిదానంగా కూర్చున్న చోటు నుంచి లేచి అటూ ఇటూ పచార్లు చేశాడు ఒకేకే. ఇది అతనికి చాలా ఇష్టమైన టాపిక్. తమ స్కూళ్ళలో పాఠాలు చెప్పేలా స్త్రీలను ప్రోత్సహించే చర్చి లీడర్ల మీద అతను తీవ్రంగా విరుచుకుపడతాడు. అలా చాలాసేపు ఓ సుదీర్ఘ ఉపన్యాసం అనంతరం భావ తీవ్రత కాస్త తగ్గి నెమ్మదైన గొంతుతో కొడుకు ఎంగేజ్‌మెంట్ విషయానికొచ్చాడు.

'ఇంతకీ ఎవరి కూతురా అమ్మాయి?'

'ఆమె నెనే అటాంగ్'

'ఏంటీ?' గొంతులోని మార్దవం మటుమాయమైంది.

ఏమంటున్నావ్? నెనే అటాంగా? దానర్థం?

'కలబార్‌కు చెందిన నెనే అటాంగ్. పెళ్ళంటూ చేసుకుంటే ఆ అమ్మాయిని మాత్రమే చేసుకుంటాను.'

ఇది చాలా దురుసైన సమాధానం. ఓ పెద్ద ప్రళయం వస్తుందనుకున్నాడు నమేకా. కానీ రాలేదు. వాళ్ళ నాన్న తనగదిలోకి వెళ్ళిపోయాడు. ఊహించని ఈ మౌనాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలీక తికమకపడ్డాడు నమేకా. తనూహించిన తిట్ల వర్షం కంటే ఈ మౌనమే ఎక్కువ వినాశకారిగా తోచిందతనికి. ఆరోజు రాత్రి ఆ పెద్దాయన భోంచేయలేదు.

మరుసటిరోజు కొడుకును పిలిచి పరిపరి విధాల నచ్చజెప్పాడు. ఫలితం శూన్యం. చివరకి అతని ఖర్మానికి అతన్ని వదిలేశాడు.

'తండ్రిగా నీకు మంచి చెడులు చెప్పటం నా బాధ్యత. నీ మనసులో ఈ ఆలోచన పెట్టిందెవరో కానీ వాళ్ళు నీ నాశనాన్ని కోరుకునే వాళ్ళు. ఇది కచ్చితంగా సాతాను చర్య' అంటూ ఇక నువ్వు వెళ్ళవచ్చన్నట్లు చేతులతోనే సంజ్ఞ చేశాడు.

'నెనేను చూస్తే నీ అభిప్రాయం మారుతుంది నాన్న' అన్నాడు నమేకా.

'ఎప్పటికీ నేనామెను చూడను'. ఇదీ సమాధానం. ఆ రోజునుంచి కొడుకుతో మాట్లాడ్డం మానేశాడు ఒకేకే. అయితే కొడుకు తన పొరపాటును తెలుసుకుంటాడని ఆశించడం మాత్రం మానలేదు. రాత్రింబవళ్ళు కొడుకు కోసం ప్రార్థనలు చేశాడు.

ఇక నమేకా విషయానికి వస్తే, తన తండ్రి బాధ అతన్నెంతగానో కదిలించింది. అది త్వరలోనే తగ్గుతుందని ఆశిస్తూ వచ్చాడు. కానీ తమ తెగలో తనకంటే ముందు ఇలా వేరే తెగ అమ్మాయిని ఎవ్వరూ పెళ్ళి చేసుకోలేదన్న వాస్తవం అతనికి తెలిసుంటే అలా అనుకునేవాడు కాదేమో.

ఇది జరిగిన కొన్ని వారాలకు-

'ఇలాంటి సంగతి ఎక్కడైనా విన్నామా?' అన్న ఓ వృద్ధుని మాటల్లో వాళ్ళ తెగ మొత్తం ఈ విషయం

గురించి ఏమనుకునేది తెలిసిపోయింది. ఒకేకేకు తమ సానుభూతి తెలవటానికి వచ్చిన వాళ్ళలో అతనూ ఒకడు. అప్పటికి నమేకా లాగోస్ వెళ్ళిపోయాడు.

'ఎప్పుడైనా ఇలాటిది విన్నామా?' అంటూ మళ్ళీ మొదలు పెట్టాడా వృద్ధుడు.

'మన దేవుడేమని చెప్పాడు?' అందుకున్నాడు ఇంకొకతను.

'కొడుకులు తండ్రుల మీద తిరగబడతారు. మన బైబిల్ లోనే అలా వుంది.'

'అంతానికి ఆరంభమిది' అన్నాడు ఇంకొకతను.

ఇదో మతపరమైన చర్చగా మారుతోందని మడుబోగు అనే పెద్ద మనిషి చర్చను అసలు విషయానికి తెచ్చాడు- 'నీ కొడుకును ఓ నాటు వైద్యునికి చూపించ రాదూ?' అన్నాడు ఒకేకేతో.

'నా కొడుక్కేం రోగం లేదు.'

'మరైతే ఇదేంటి రోగం కాక! వాడి బుర్రకు పట్టిందో జబ్బు. సరైన నాటు వైద్యుడు మాత్రమే వాడి మనసు మార్చగలడు. వాడిక్కావలసింది 'అమలీలి' అనే మందు. తమ భర్తలు పక్కదోవ పడ్తున్నారనుకున్నప్పుడు వాళ్ళను తిరిగి దారిలోకి తెచ్చుకోవడానికి ఆడవాళ్ళు వాడతారే- అదీ- అదీ మందు.'

'మడుబోగు చెప్పింది నిజం. నాటువైద్యుని సంప్రదించడమే ఇప్పుడు చేయవలసింది' అన్నాడొకతను.

'నేను నాటువైద్యుని దగ్గరకు మాత్రం పోను.' మూఢనమ్మకాలు గల తన పొరుగువారికంటే కాస్త మెరుగు ఒకేకే- 'నా కొడుకు నాశనమైతే అది వాడి స్వయంకృతం. అందులో నాకు పాలు వద్దు.'

ఆరునెలల తరువాత ఓ రోజు నమేకా తన భార్యకు తండ్రి దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాన్ని చూపించాడు.

'ఏమాత్రం ఫీలింగ్స్ లేకుండా నువ్వు నాకు నీ పెళ్ళి ఫోటో పంపటం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. దాన్ని నీకు తిప్పి పంపాలనుకున్నాను. కానీ కాస్త ఆలోచించిన మీదట ఆ ఫోటోలో నీ భార్య భాగాన్ని మాత్రం చించి నీకు వాపసు పంపుతున్నాను. ఎందుకంటే ఆమెతో నాకు ఏమాత్రం సంబంధం లేదు. నీతో కూడా ఏ సంబంధం లేకుండా వుంటే ఎంత బాగుణ్ణు.'

ఆ ఉత్తరం చదివి చిరిగిపోయిన తన ఫోటో వంక చూసుకుని కళ్ళనీళ్ళ పర్యంతమైంది నెనే. ఆమెకు దుఃఖం ఆగలేదు.

'ఏడవకు.' సముదాయించాడు నమేకా. 'మా నాన్న మనసు మంచిది. ఏదో ఒకరోజు తప్పక మన వివాహాన్ని అంగీకరిస్తాడు.' కానీ ఏళ్ళు గడిచినా ఆరోజు మాత్రం రాలేదు.

ఎనిమిది సంవత్సరాలపాటు తన కొడుకుతో ఏమాత్రం సంబంధం లేనట్టే వున్నాడు ఒకేకే. మూడు సార్లు మాత్రమే- అదీ సెలవుల్లో ఇంటికి వస్తానని కొడుకు అడిగినప్పుడు- ఉత్తరం రాశాడు కొడుక్కి. ఓసారి రాశాడిలా- 'నీకు నా ఇంట్లో స్థానం లేదు. ఎక్కడ, ఎలా నీ సెలవులు- ఆ మాటకొస్తే నీ జీవితం- గడుపుతావో నీ ఇష్టం. నీకు, నాకు సంబంధం లేదు.'

నమేకా పెళ్ళి పట్ల వ్యతిరేకత అతని వూరికి మాత్రమే పరిమితం కాలేదు.



> ఆడవాళ్ళు కలిసినప్పుడు నెనే పట్ల శత్రుత్వం చూపలేదు. బదులుగా 'నీవు మాలో ఒకదానివి కావు' అన్న భావం స్ఫురించేలా ఆమెపట్ల అవసరానికి మించిన గౌరవాన్ని ప్రదర్శించేవారు. కానైతే, కాలం గడిచేకొద్దీ, నెనే క్రమంగా ఈ భావాన్ని పోగొట్టి వాళ్ళ స్నేహాన్ని సంపాదించగలిగింది.

లాగోస్ లో కూడా, ప్రత్యేకించి అక్కడ వుండే అతని తెగ వారిలో, అది మరో విధంగా కనిపించింది. ఆడవాళ్ళు కలిసినప్పుడు నెనే పట్ల శత్రుత్వం చూపలేదు. బదులుగా 'నువ్వు మాలో ఒకదానివి కావు' అన్న భావం స్ఫురించేలా ఆమెపట్ల అవసరానికి మించిన గౌరవాన్ని ప్రదర్శించేవారు. కానైతే, కాలం గడిచేకొద్దీ, నెనే క్రమంగా ఈ భావాన్ని పోగొట్టి వాళ్ళ స్నేహాన్ని సంపాదించగలిగింది. మెల్లిగా, అయిష్టంగానైనా సరే, తమలో చాలామందికంటే నెనే ఇల్లు బాగా సర్దుకుంటుందని వాళ్ళు ఒప్పుకోక తప్పలేదు.

క్రమంగా నమేకా, నెనేల అన్యోన్య దాంపత్యపు కథ 'ఈబో' దేశపు ఆ మారుమూల పల్లెకు చేరింది. కానీ ఆ వూళ్ళో ఈ విషయం గురించి ఏమాత్రం తెలీని అతికొద్ది మందిలో నమేకా తండ్రి ఒకడు. కొడుకు సంగతులు ఎవ్వరు ప్రస్తావించినా తీవ్రంగా మండిపడేవాడు. అందుకే ఎవ్వరూ అతని దగ్గర ఈ ప్రసక్తి తెచ్చేవారు కాదు. విశ్వప్రయత్నం చేసి కొడుకును మనసు మూలకు నెట్టేయ గలిగాడు ఆ పెద్దాయన. ఆ అంతర్యుద్ధం అతన్ని ఎంతగానో కుంగదీసినా, చివరకి ప్రయత్నించి, అతనే గెలిచాడు.

ఇలా ఉండగా ఓరోజు నెనే నుంచి అతనికో ఉత్తరం వచ్చింది. ఎంత వద్దనుకున్నా యథాలాపంగా చదవసాగాడు. హఠాత్తుగా అతని మొహంలో రంగులు మారాయి. జాగ్రత్తగా చదవడం మొదలెట్టాడు-

'... మా ఇద్దరు కొడుకులు వాళ్లకో తాతయ్య వున్నారని తెలిసిన రోజునుంచి తమను ఆయన దగ్గరకు తీసుకెళ్ళమని పట్టుపడ్తున్నారు. మీరు వాళ్ళని చూడరని చెప్పటం నాకు సాధ్యం కావడం లేదు. వచ్చే నెల సెలవుల్లో కొన్ని రోజుల కోసం నమేకా పిల్లలిద్దర్నీ మీ దగ్గరకు తేవడానికి అనుమతించవలసిందిగా అర్థిస్తున్నాను. నేను ఇక్కడ లాగోస్ లోనే వుంటాను...'

ఇన్ని సంవత్సరాలు అవిశ్రాంతంగా తాను కట్టిన కఠిన నిర్ణయపు గోడ బీటలు వారుతోందని తెలుస్తోంది ఒకేకేకు. తన నిర్ణయం మార్చుకోకూడదని, పంతం వీడకూడదని తనకు తాను గట్టిగా చెప్పుకున్నాడు. ఏ భావోద్వేగ అభ్యర్థనలకీ తన మనసు కరిగిపోకూడదు. ఇన్నేళ్ళుగా తాను అనుభవించిన మానసిక ఘర్షణ పునఃప్రారంభమైనట్లయింది. ఓ కిటికీని ఆసరాగా చేసు కొని ఆనుకుని బయటికి తొంగిచూశాడు ఒకేకే. ఆకాశం దట్టంగా మబ్బుపట్టి ఉంది. దుమ్ము, ధూళి, ఎండుటాకులు రేపుకుంటూ పెద్దగాలి వీస్తోంది. మనిషి ఆంతరంగిక పోరాటంలో ప్రకృతి కూడా పాలుపంచుకునే అరుదైన సంఘటన అది. వెనువెంటనే వర్షం మొదలైంది. సంవత్సరంలో మొదటి వాన- పెద్ద పెద్ద చినుకులతో ఉరుములు, మెరుపులతో కూడి కాలమార్పును సూచించే తొలకరి. తన ఇద్దరు మనవల గురించి ఆలోచించకుండా వుండటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు ఒకేకే. కానీ తాను ఓడిపోయే యుద్ధాన్ని చేస్తున్నానని అతనికి తెలుస్తూనే వుంది. తనకు నచ్చిన ఓ భక్తిగీతం ఆల పిస్తూ మనసును మళ్ళిద్దామనుకుంటే రూఫ్ మీదపడుతున్న పెద్ద వాన చినుకుల శబ్దంలో ట్యూన్ సరిగా కుదరలేదు. ధ్యాస మళ్ళీ పిల్లలవైపే మళ్ళుతోంది. వాళ్ళ మొహాల మీద తలుపెలా వేయగలడు తను? అతనికో విచిత్రమైన ఆలోచన వచ్చింది- తన ఇద్దరు మనవలు వర్షంలో దుఃఖంతో ఏడుస్తూ ఒంటరిగా అనాథల్లా మూసిన తన ఇంటి తలుపుల ముందు నుంచున్నట్లు అనిపించింది.

ఆరోజు రాత్రి అతనికి పశ్చాత్తాపంతో నిద్రపట్టలేదు. వాళ్ళకి న్యాయం చేయకుండానే తాను చనిపోతానేమో అన్న ఓ అర్థంలేని భయం అతన్ని నిద్రకు దూరం చేసింది.

●

